సాక్షి నల్లగొండ

శుక్రవారం ; 28 ; మార్చి ; 2025



నిజమైన పండుగ ఉగాది

సాహితీ లోకానికి నిజమైన పండుగ ఉగాది అని సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. - IIలో



ఎంజియా ఆవరణలో మంటలు

నల్లగొండలోని ఎంజియా ఆవరణలో గురువారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. - IIలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-34 (శుక్రవారం సా॥)

సహర్ 4-51 (శనివారం ఉ॥)

న్యూస్‌రీల్

నల్లగొండ బార్ అసోసియేషన్ ఎన్నికలు

రామగిరి (నల్లగొండ) : నల్లగొండ బార్ అసోసియేషన్ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల అయింది. గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభించారు. అధ్యక్ష, ఉపాధ్యక్షుడు, జనరల్ సెక్రటరీతో ఇతర పదవులకు ఎన్నికలు జరగనున్నాయి. గురువారం పలువురు నామినేషన్లను దాఖలు చేశారు. ఏప్రిల్ 4వ తేదీన ఓటింగ్ జరగనుంది. అదే రోజు సాయంత్రం ఓట్లను లెక్కించి కమిటీలను ప్రకటించనున్నారు.

రెన్యువల్ చేసుకోవాలి

నల్లగొండ : జిల్లాలోని ప్రైవేట్ డీఈడీ కాలేజీ యాజమాన్యాలు 2025-26 విద్యా సంవత్సరం నుంచి 2028-29 విద్యా సంవత్సరానికి రెన్యువల్ చేసుకోవాలని డైట్ ప్రిన్సిపాల్ నర్సింహ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.లక్ష డీడీ లేదా బ్యాంకు చెక్కు రూపంలో ద చైర్‌పర్సన్ ఆఫ్ ద అఫిలియేషన్ కమిటీ అండ్ ద డీఎస్ఈ తెలంగాణ హైదరాబాద్ పేరున చెల్లించాలని సూచించారు. చెల్లించిన ఫీజు వివరాలతో పాటు ప్రతిపాదనలు ఈ నెల 31లోగా ఎస్‌సీఈఆర్‌టీ హైదరాబాద్ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



హాలియాలో వ్యవసాయ మార్కెట్ వద్ద మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి

హాలియా : రైతుల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. హాలియా వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహిస్తున్న కందుల కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించి రైతులతో కొద్దిసేపు ముచ్చటించారు. కందుల మార్కెట్‌ను ఉపయోగించుకొని ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర క్వింటా రూ.7550 పొందారని ఆయ సూచించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జానారెడ్డిని మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి కాకునూరి నారాయణగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, గౌనీ రాజా రమేష్‌యాదవ్, కోట నాగిరెడ్డి, మార్కెట్ సూపర్‌వైజర్ ఖలీల్, సిబ్బంది సత్యనారాయణ, రామాంజి, సురేష్ తదితరులు ఉన్నారు.

ఏప్రిల్ 4 వరకు పింఛన్ల పంపిణీ

నల్లగొండ : ఆసరా పింఛన్లను ఏప్రిల్ 4వ తేదీ వరకు పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఓ శేఖర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వృద్ధాప్య, వితంతు, వికలాంగుల, చేనేత, కల్లు గీత, ఒంటరి మహిళలకు పింఛన్లను ఆయా పోస్టాఫీస్‌లలో అందజేయనున్నట్లు తెలిపారు.

మెరిట్‌లిస్ట్ విడుదల

నల్లగొండ టౌన్ : కాంట్రాక్టు పాలియేటివ్ కేర్ స్టాఫ్‌నర్సు పోస్టుల నియామకాల ప్రొవిజినల్ మెరిట్ లిస్టును డీఎంహెచ్ఓ కార్యాలయం నోటీసు బోర్డు, వెబ్‌సైట్ www.nalgonda.nic.inలో ఉంచినట్లు సిబ్బంది గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లిస్టుపై అభ్యంతరాలు ఉంటే 29లోగా డీఎంహెచ్ఓ కార్యాలయంలో రాత పూర్వకంగా సమర్పించాలని పేర్కొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

లక్ష్యం ఏర్పరచుకోవాలి


- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : విద్యార్థి దశ నుంచే లక్ష్యం ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. గురువారం ఆమె నల్లగొండలోని ఎస్సీ బాలికల గురుకులాన్ని సందర్శించారు. పాఠశాలలో సౌకర్యాలపై ఆరా తీశారు. తరగతి గదుల్లో వెళ్లి విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. గణితం, సైన్స్, సోషల్, హిందీ, ఇంగ్లిష్ సబ్జెక్టులపై ప్రశ్నలు అడిగి.. సరైన సమాధానాలు చెప్పిన పిల్లలకు ఆమె చాక్లెట్లు ఇచ్చారు.

పల్లెలకు పాలనాధికారులు

జీపీఓ పేరుతో కొత్త పోస్టులు మంజూరు

- రెవెన్యూ వ్యవస్థ పటిష్టానికి పూనుకున్న ప్రభుత్వం
- పూర్వ వీఆర్‌ఓ, వీఆర్‌ఏలకు అవకాశం
- జిల్లాలో 370 మంది తిరిగి వచ్చేందుకు దరఖాస్తు
- నియామకాలపై కొరవడిన స్పష్టత



నల్లగొండ : గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థ పటిష్టానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గ్రామీణ ప్రజలకు రెవెన్యూ సేవలు అందించేలా గ్రామ పాలనాధికారి(జీపీఓ) పేరుతో ఉద్యోగులను నియమించేందుకు సిద్ధమైంది. ఇది వరకు గ్రామాల్లో సేవలందించిన వీఆర్‌ఓ, వీఆర్‌ఏల వ్యవస్థను గత ప్రభుత్వం రద్దు చేసి వారిని ఇతర శాఖల్లో సర్దుబాటు చేసిన విషయం తెలిసిందే. తిరిగి వారు పూర్వ సంస్థలో చేరేందుకు అవకాశం కల్పించింది. తిరిగి రెవెన్యూ శాఖలో చేరేందుకు జిల్లా వ్యాప్తంగా 370 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే వారి నియామకానికి సంబంధించిన విధివిధానాలు ఖరారు కాలేదు.

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా..

అయితే గత ప్రభుత్వ హయాంలో ఇతర శాఖల్లో వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలను సర్దుబాటు చేశారు. ఇందులో 2022 ఆగస్టులో అప్పటి ప్రభుత్వం 390 మంది వీఆర్‌ఓలు రెవెన్యూతో పాటు 37 శాఖల్లో, 2023 ఆగస్టులో 850 మంది వీఆర్‌ఏలను ఎనిమిది శాఖల్లో సర్దుబాటు చేశారు. దీంతో గ్రామాల్లో భూ సర్వేలు, భూమి హక్కులు, విద్యార్హత ధ్రువపత్రాల జారీ, విచారణలు, సంక్షేమ పథకాల అర్హుల గుర్తింపు, విపత్తుల సమాచారం అందజేయడం, తదితర వాటిపై ప్రభావం చూపింది. ఫలితంగా కొన్నింటిని పంచాయతీ కార్యదర్శులతో చేయిస్తున్నారు. ఆ వ్యవస్థ రద్దయ్యాక.. రెవెన్యూ పరంగా గ్రామాల్లో భూ సమస్యలు, సంక్షేమ పథకాల అర్హుల గుర్తింపు, ఇతర సర్వేలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలిచేలా ఆర్థిక శాఖ జీపీఓ పోస్టులు మంజూరు చేసింది.

గ్రామాల వారీగానేనా..!

ప్రస్తుతం రెవెన్యూ వ్యవస్థలో మళ్లీ గ్రామ పరిపాలన అధికారులను నియమిస్తోంది. అయితే గ్రామ పంచాయతీల వారీగా నియమిస్తుందా.. లేక రెవెన్యూ గ్రామాల వారీగానా, క్లస్టర్ల వారీగానా అనే విషయం ఇంకా తేలలేదు. గ్రామ పంచాయతీల వారీగా నియమిస్తే జిల్లాలో 844 మంది, రెవెన్యూ గ్రామాల వారీగా అయితే 566 మంది, క్లస్టర్ల వారిగా నియమిస్తే 340 మంది నియమించే అవకాశం ఉంటుంది. ఏ ప్రాతిపదికన నియమిస్తుందనే విషయం ఇప్పటి వరకు ప్రకటించలేదు. అయితే గతంలో వీఆర్‌ఏలు, వీఆర్‌ఓలు గ్రామాల వారీగా ఉన్నందున అదే విధంగా నియమిస్తారనే చర్చ సాగుతోంది.

జీపీఓ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గ్రామ పాలనాధికారి పోస్టుల నియామకాల కోసం పూర్వ వీఆర్‌ఏ, వీఆర్‌ఓల్లో తిరిగి మాతృసంస్థకు వచ్చేందుకు ఆసక్తి ఉన్నవారి నుంచి ఈ ఏడాది జనవరిలోనే దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం ఆహ్వానించింది. జిల్లా వ్యాప్తంగా మంది 370 మంది జీపీఓ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. అయితే జిల్లాలో ఎన్ని పోస్టులు ఖాళీలు ఉన్నాయో.. ఎంత మందిని నియమిస్తారనేది ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదు.

మహిళా సంఘాలు బలోపేతం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : స్వయం సహాయక మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. స్వయం సహాయక మహిళా సంఘాలపై గురువారం హైదరాబాద్ నుంచి సెర్ప్ సీఈఓ దివ్య ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు, పాఠశాల విద్యార్థుల యూనిఫాం, పెట్రోల్ బంకుల నిర్వహణ తదితర కార్యక్రమాల వల్ల స్వయం సహాయక మహిళా సంఘాలు ఆర్థికంగా మరింత బలోపేతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఐకేపీ ద్వారా యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పెంచాలన్నారు. కేంద్రాల నిర్వహణ ద్వారా వచ్చే కమీషన్ మొత్తంలో 10 శాతం జిల్లా సమాఖ్యలు, 90శాతం గ్రామ సమాఖ్యలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. సదరం క్యాంపులు డేటాను ఎప్పటికప్పుడు పూర్తి చేసేందుకు డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించాలన్నారు. ఆసరా పింఛన్లకు సంబంధించిన లబ్ధిదారులు చనిపోతే వారి పేర్లను జాబితాలో తొలగించాలని.. భాగస్వామికి అర్హత ఉంటే పింఛన్ మంజూరు చేయాలన్నారు. మండల, నియోజకవర్గాల స్థాయిలో పెట్రోల్ బంకుల ఏర్పాటుకు మహిళా సంఘాలు సిద్ధం కావాలన్నారు. ఈ పెట్రోల్ బంకుల వద్ద రెస్టారెంట్, మాల్స్ నిర్వహించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాలపై ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్



రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

తిప్పర్తి : ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా.. ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం తిప్పర్తి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తెచ్చిన ధాన్యాన్ని మ్యాశ్చర్ వచ్చిన వెంటనే కాంటా వేయాలన్నారు. కొనుగోలు కేంద్రంలో తాగునీటి వసతి ఏర్పాటు చేయాలన్నారు. రైతులు ధాన్యాన్ని పొలం వద్దే ఆరబెట్టుకుని కేంద్రాలకు తెవాలన్నారు. ఆయన వెంట సివిల్ సప్లయ్ డీఎం హరిష్, డీసీఓ పాత్యానాయక్, మార్కెటింగ్ ఏడీ ఛాయాదేవి, తహసీల్దార్ పరుశురాములు, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, సీఈఓ భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీ లొల్లిని జయప్రదం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ సంఘం నాయకులు

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

నల్లగొండ టౌన్ : బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్య, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం పంపిన బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 2న ఢిల్లీలో జరిగే బీసీ లొల్లి కార్యక్రమంలో జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ శాసనసభలో బిల్లును ఆమోదించించేందుకు సహకరించిన పార్టీలకు కృతజ్ఞతలు తెలిపారు. బీసీ బిల్లులో ముస్లింలను చేర్చడాన్ని తప్పుపడుతూ ఈ బిల్లును కేంద్రం ఆమోదించకుండా అడ్డుపడాలని బీజేపీ చూస్తోందన్నారు. ఏప్రిల్ 25వ తేదీలోగా బీసీ బిల్లు ఆమోదిస్తే విజయోత్సవ సభ పెడతామని, లేకపోతే బీజేపీపై యుద్ధం ప్రకటిస్తామన్నారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ, కంది సూర్యనారాయణ, నల్ల సోమమల్లయ్య, దాసోజు విశ్వనాథం, నకిరెకంటి కాశయ్యగౌడ్, గోలి విజయ్‌కుమార్, గుండ కోటప్ప, పసుపులేటి సీతారాములు, చిక్కుళ్ల రాములు, ఆదినారాయణ, శంకర్‌గౌడ్, సైదులుగౌడ్, మధుయాదవ్, లింగయ్య, భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.

● కొనుగోలు కేంద్రాలకు సామగ్రి





యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన ఎలక్ట్రానిక్ కాంటాలు, టార్పాలిన్లు, మ్యాచర్ మిషన్లు, తాలుపట్టే మిషన్లను గురువారం జిల్లా కేంద్రంలోని మార్కెటింగ్ శాఖ గోదాముల నుంచి ఆయా కేంద్రాలకు తరలించారు - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

కలెక్టర్‌కు వినతి

నల్లగొండ : నకిలీ సర్టిఫికెట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెగ్యులర్ అయిన లెక్చరర్లకు జీతాలు చెల్లించాలని ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లపై ఒత్తిడి తెస్తున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి దస్రూనాయక్‌పై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ సమితి జిల్లా జనరల్ సెక్రటరి వేముల శేఖర్ కలెక్టర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేసే సందర్భంలో సర్టిఫికెట్లను పరిశీలించిన తర్వాతే రెగ్యులర్ చేయాల్సి ఉన్నా.. కొందరి సర్టిఫికెట్లు పరిశీలించకుండానే రెగ్యులరైజ్ చేశారని పేర్కొన్నారు. వారికి వేతనాలు ఇప్పించాలని కళాశాల ప్రిన్సిపాళ్లపై డీఐఈఓ ఒత్తిడి తెస్తున్నారని ఫిర్యాదు చేశారు.

సీఎం సభ ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

హుజూర్‌నగర్: ముఖ్యమంత్రి సభకు వచ్చే ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈనెల 30న హుజూర్‌నగర్‌లో జరగనున్న సీఎం సభా స్థలి ఏర్పాట్లను పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌తో కలిసి మంత్రి ఉత్తమ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సభకు వచ్చే ప్రజలకు నీడ ఉండేలా హ్యాంగర్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు. మజ్జిగ ప్యాకెట్లు, చల్లని తాగునీరు అందించాలన్నారు. ట్రాఫిక్‌ను నియంత్రించి వాహనాల రాకపోకలు సజావుగా సాగేలా చూడాలన్నారు. పార్కింగ్ స్థలాలకు అప్రోచ్ రోడ్లు శుక్రవారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. తదుపరి మంత్రి క్యాంప్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేసారు. సన్నబియ్యం పంపిణీ ప్రారంభానికి లబ్ధిదారులను ఎంపిక చేసి సిద్ధంగా ఉంచాలని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమం లెడ్ స్క్రీన్లను ప్రజలు తిలంకించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ నరసింహ, అదనపు కలెక్టర్ పి.రాంబాబు, ఆర్‌డీఓలు శ్రీనివాసులు, సూర్యనారాయణ, వేణుమాధవ రావు పాల్గొన్నారు.

బకాయి చెల్లించకుంటే.. భవనం జప్తు

- నీలగిరి మున్సిపాలిటీలో రూ.7 కోట్ల మొండి బకాయిలు
- రేపటి నుంచి ఆస్తుల జప్తునకు శ్రీకారం చుట్టనున్న మున్సిపాలిటీ
- గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన స్పెషల్ ఆఫీసర్



ఆస్తి పన్ను కట్టినవారికి రశీదు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్

నల్లగొండ టూటౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్ను పాత బకాయిలపై 90 శాతం వడ్డీ మాఫీ చేయడంతో మున్సిపల్ యంత్రాంగం మొండి బకాయిలపై దృష్టి సారించింది. వడ్డీమాఫీకి సంబంధించి విధివిధానాలు గురువారం నుంచి అమల్లోకి రావడంతో మున్సిపల్ సిబ్బంది ఇంటింటికి తిరిగి పన్ను వసూలు చేస్తున్నారు. నీలగిరి మున్సిపాలిటీలో దాదాపు 100 మంది ఉద్యోగులు, సిబ్బంది ఆస్తి పన్ను వసూలు కోసం కాలనీలన్నీ తిరుగుతున్నారు. ఆస్తి పన్ను బకాయిలు చెల్లించకుంటే ఆస్తులు జప్తులు చేయాలని ప్రభుత్వం నుంచి కూడా ఆదేశాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే మిర్యాలగూడ, చౌటుప్పల్ మున్సిపాలిటీల్లో ఆస్తులు జప్తులు చేసిన విషయాన్ని సైతం ఇక్కడ ప్రస్తావిస్తున్నారు. 40 వేల వరకు భవనాలు ఉన్న నీలగిరి పట్టణంలో ఇంకా రూ.30 కోట్ల వరకు ఆస్తి పన్ను వసూలు కావాల్సి ఉంది. ఆస్తి పన్ను బకాయిలపై 90 శాతం వడ్డీ మాఫీ చేసే ప్రక్రియకు ప్రభుత్వం మార్చి నెలాఖరులో ఉత్తర్వులు ఇవ్వడంతో సమయం కూడా తక్కువగా ఉంది. ఈ నెల 31లోగా మొత్తం ఆస్తి పన్ను చెల్లిస్తేనే 90 శాతం వడ్డీ మాఫీ వర్తించనుంది. మొండి బకాయిలు చెల్లించకుంటే ఆస్తులు జప్తు చేయాలని ఇప్పటికే స్పెషల్ ఆఫీసర్ మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది.

మొండి బకాయిలు రూ.7 కోట్లు..

నీలగిరి మున్సిపాలిటీలో కొందరు బడాబాబులు కొన్ని సంవత్సరాల నుంచి ఆస్తి పన్ను చెల్లించకుండా మొండికేస్తున్నారు. మొండి బకాయిదారులందరు కమర్షియల్ వ్యాపారం చేసేవారు కావడం గమనార్హం. వాళ్ల వ్యాపారం చేసి లక్షల రూపాయలు వెనకేసుకుంటూ కూడా ఆస్తి పన్ను చెల్లించకుండా రాజకీయ నేతల ద్వారా ఒత్తిళ్లు తెస్తున్నారు. కానీ ఈ ఏడాది మున్సిపల్ ఉన్నతాధికారులు ఆస్తి పన్ను వసూలుపై సీరియస్‌గా ఉండడంతోపాటు మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ అధికారులకు మెమోలు ఇస్తామని హెచ్చరించిన విషయం తెలిసిందే. నీలగిరి పట్టణంలో మొండి బకాయిదారులు 70 మందికి పైగానే ఉన్నారు. వీరంతా లక్షల్లో పన్ను బకాయి పడి ఉన్నారు. ఈ 70 మంది రూ.7.50 కోట్లకు పైగానే ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉంది. పాత బకాయిల వడ్డీని 90 శాతం మాఫీ చేయడంతో వీరికి కూడా భారం తగ్గిందనే చెప్పాలి. పన్ను చెల్లించడానికి వీరికి వెసులుబాటు కూడా ఉంది.

శనివారం నుంచి జప్తులు..

ఆస్తి పన్ను వడ్డీపై 90 శాతం మాఫీ కావడంతో బకాయిదారులు కొందరు వాయిదా పెట్టినట్లు మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. రెడ్ నోటీస్‌లు అందుకున్న 70 మంది మొండి బకాయిదారులు శుక్రవారంలోగా ఆస్తి పన్ను చెల్లించకుంటే శనివారం వారి ఆస్తులు జప్తు చేయాలని యంత్రాంగం నిర్ణయించింది. వాణిజ్య వ్యాపారాలకు వినియోగిస్తున్న భవనాలను సీజ్ చేయడంతోపాటు నల్లా కనెక్షన్ కట్ చేయనున్నారు. అదేవిధంగా స్పెషల్ ఆఫీసర్ అనుమతితో విద్యుత్ సరఫరా కూడా కట్ చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇప్పటికే కొన్ని మున్సిపాలిటీల్లో బకాయిదారుల ఇళ్ల ఎదుట చప్పుట్లు ఉద్యోగుల నిరసన లాంటి కార్యక్రమాలు చేపడుతున్న విషయం తెలిసిందే. శనివారం నుంచి జిల్లా కేంద్రంలో కూడా మొండి బకాయిలు చెల్లించని వారి భవనాల వద్ద నిరసన తెలపడంతోపాటు ఆస్తులు జప్తులు చేయనున్నారు.

వడ్డీ మాఫీ సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్ను బకాయిలపై 90 శాతం వడ్డీ మాఫీ చేసింది. పన్ను బకాయి పడ్డ వారంతా వెంటనే పన్ను చెల్లించి వడ్డీ మాఫీ సద్వినియోగం చేసుకోవాలి. పన్ను చెల్లించకుంటే బకాయి ఉన్నవారి ఆస్తులు జప్తు చేస్తాం.

-సయ్యద్ ముసాబ్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

SIB మిర్యాలగూడ బ్రాంచి-20932, నల్గొండ జిల్లా.

అనుబంధం – IV-A [నిబంధన 8(6) అంశాలు చూడండి]

స్థిరాస్తుల అమ్మకం కోసం ఇ-వేలం బహిరంగ ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద బ్యాంకునకు తనఖా చేసిన స్థిరాస్తులు అమ్మకము.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద జారీచేసిన నోటీసుకు అనుగుణంగా దిగువ పేర్కొన్న ఆస్తిని స్వాధీనపరచుకొన్నారు. దిగువ ఋణఖాతాలకు చెందిన ఆస్తిని "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అవిధంగానే" మరియు "ఉన్నది ఉన్నట్లుగానే" ప్రాతిపదికపై ఆస్తులను ది.29-04-2025 తేదీన విక్రయించు హక్కుతో బ్యాంకు బకాయిలు ది.27.03.2025 తేదీనాటికి రూ.49,33,477/- (అక్షరాల నలభై తొమ్మిది లక్షల ముప్పై మూడు వేల నాలుగు వందల డెబ్బై ఏడు రూపాయలు మాత్రమే) మరియు వడ్డీ, ఖర్చులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఛార్జీలు, ఇతర వ్యయాలు తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, సదరు చట్టపు సెక్షన్ 13(4) లోని అధికారములు వినియోగిస్తూ సదరు ఆస్తిని విక్రయించుట ద్వారా బ్యాంకు బకాయిలు రాబట్టవలెనని దిగువ సంతకందారు ప్రతిపాదించుచున్నారు. వెబ్ పోర్టల్ (https://www.bankeauctions.com) వద్ద ఏర్పాటుచేసిన ఇ-వేలం ప్లాట్‌ఫారం ద్వారా దిగువ సంతకముదారుచే అమ్మకము నిర్వహించబడును.

ఋణగ్రహీతలు, హామీదారుల యొక్క పేర్లు మరియు ఖాతా నెంబరు : ఋణగ్రహీత: M/s.మంజీరా ఇండేన్, చిరునామా: డి.నెం.5-100, షాప్ నెం.3, పాత నాగార్జున టాకీస్ రోడ్డు, షాబునగర్, మిర్యాలగూడ, నల్గొండ జిల్లా, తెలంగాణ-508207. పార్టనర్-1: శ్రీ అన్నెబోయిన శివప్రసాద్ (లేటు), తండ్రి: మట్టయ్య, హెచ్.నెం.30-203, ఈదులగూడ, మిర్యాలగూడ, నల్గొండ జిల్లా, తెలంగాణ-508207. పార్టనర్-2: శ్రీమతి అన్నెబోయిన కావ్యశ్రీ A/O బేబీ అల్కా సెంచురీ, భర్త: శివప్రసాద్ (లేటు), హెచ్.నెం.11-21-1014, యన్‌టిఆర్ నగర్, యల్‌బి నగర్, ఆర్ఆర్ (జిల్లా)-500074. పార్టనర్-3: శ్రీ అన్నెబోయిన సతీష్, తండ్రి: మట్టయ్య, హెచ్.నెం.30-203, విద్యానగర్, మిర్యాలగూడ, నల్గొండ జిల్లా, తెలంగాణ-508207. కుటుంబసభ్యులు: 1) శ్రీ అన్నెబోయిన మట్టయ్య, తండ్రి: సైదయ్య, హెచ్.నెం.30-203, విద్యానగర్, మిర్యాలగూడ, నల్గొండ జిల్లా, తెలంగాణ-508207. (TSGGDG22512216) (Memo no.31346/set.II.2/2010 Dated. 25.10.2010.), 2) శ్రీమతి అన్నెబోయిన ధనమ్మ, భర్త: మట్టయ్య, 3) శ్రీ అన్నెబోయిన హరిత్, తండ్రి: శివప్రసాద్ (లేటు), 4) శ్రీ అన్నెబోయిన హర్షిత్, తండ్రి: శివప్రసాద్ (లేటు), 5) శ్రీమతి అన్నెబోయిన కావ్యశ్రీ, భర్త: శివప్రసాద్ (లేటు). హామీదారులు: 1) శ్రీ అన్నెబోయిన సతీష్, తండ్రి: మట్టయ్య, 2) శ్రీమతి అన్నెబోయిన ధనమ్మ, భర్త: మట్టయ్య, 3) శ్రీమతి అన్నెబోయిన కావ్యశ్రీ A/O బేబీ అల్కా సెంచురీ, భర్త: శివప్రసాద్ (లేటు) A/c. No. 37466908190 (CC), 42532411899 (SME Car loan).

ఆస్తి యొక్క షెడ్యూలు

29-01-2015 తేదీగల రిజిస్టర్ విక్రయ దస్తావేజు నెం.995/2015 ప్రకారము ఆస్తి, నల్గొండ జిల్లా, మిర్యాలగూడ టౌన్ మరియు మునిసిపాలిటీ, చైతన్య నగర్, బ్లాక్ నెం.7, రెసిడెన్షియల్ జోన్ లోపల, సర్వే నెం.69 నందు 1050.00 చ॥గ॥ (877.83 చ॥మీ॥) విస్తీర్ణముగల ఓపెన్ ఇంటి ప్లాట్ నెం.160, 161 & 162కు సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు: ఉత్తరం: ఎ.ధనమ్మ యొక్క ప్లాట్ నెం. 163; దక్షిణం: ప్లాట్ నెం. 159; తూర్పు: 33'-0" వెడల్పుగల రోడ్డు; పడమర : ప్లాట్ నెం. 151, 152 & 153.

ఇ-వేలం యొక్క తేదీ మరియు సమయం: 29-04-2025, సమయం: మ॥ 12-00 గం॥ల నుండి మ॥ 1-00 గం॥ వరకు

రిజర్వుధర : రూ.1,03,95,000/-, ధరావత్తు సొమ్ము (EMD) : రూ.10,39,500/- (రిజర్వుధరలో 10%)

బిడ్ పెంపుదల మొత్తం: రూ.30,000/- (ప్రతి 5 నిమిషాల అపరిమిత పొడిగింపులతో)

ధరావత్తు చెల్లింపులు	EFT/NEFT/RTGS Transfer to SBI SIB MIRYALAGUDA BRANCH. A/C NO:37608221542, IFSC CODE:SBIN0020932
ఆస్తి యొక్క తనిఖీ	10-04-2025 నుండి 26-04-2025 వరకు బ్యాంక్ పనిదినములలో ఉ॥ 11-00 గం॥ల నుండి సా॥ 4-00 గం॥ల వరకు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీ: M/s.మిత్ర సొల్యూషన్స్, మిర్యాలగూడ బ్రాంచి, మొబైల్ నెం: 9502960779

ఆఫ్‌లైన్ / ఆన్‌లైన్ అప్లికేషన్, ధరావత్తు సమర్పించుటకు చివరి తేదీ మరియు సమయం: 28.04.2025, సా॥ 4.00 గం॥ల వరకు

ఇ-వేలం / అమ్మకం యొక్క నియమ నిబంధనలు

1) ఇ-వేలమును బ్యాంక్ అప్రూవ్డ్ సర్వీస్‌ప్రొవైడర్ "మెసర్స్ సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్" వారిచే నిర్వహించబడును. మొబైల్ నెం. 9948182222, Email ID: telangana@c1india.com
2) ఈ అమ్మకం వేలమును "ఆన్‌లైన్ ఇ-వేలం / బిడ్డింగ్ ద్వారా (https://www.bankeauctions.com) వెబ్‌సైట్‌నందు నిర్వహించబడును.
3) ఆసక్తిగల బిడ్డర్లు చెల్లుబాటు అయ్యే ఇమెయిల్ ఐడి కలిగిఉండవలెను. ఆసక్తిగల బిడ్డర్లు బిడ్లను లాగిన్ ఐడి మరియు పాస్‌వర్డ్ ద్వారా https://www.bankeauctions.com వెబ్‌పోర్టల్ ద్వారా సమర్పించవలెను. (యూజర్ ఐడీ మరియు పాస్‌వర్డ్ https://www.bankeauctions.com నందు మీ పేరుతో నమోదు చేసుకోవడం ద్వారా ఉచితంగా పొందవచ్చును). మరియు ఆస్తికి సంబంధించిన ఇతర వివరములకు దయచేసి అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, SIB మిర్యాలగూడ బ్రాంచి, ఛీఫ్ మేనేజర్, మొబైల్ నెం. 9100070235 నందు మరియు మెసర్స్ మిత్ర సొల్యూషన్స్, మిర్యాలగూడ బ్రాంచి (ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీ), మొబైల్ నెం. 9502960779 నందు సంప్రదించగలరు.
4) SARFAESI Act, 2002 క్రింద సూచించబడిన నియమాలు / నిబంధనల ప్రకారం అమ్మకం నిర్వహించబడును. మా టెండర్ దరఖాస్తులోని ఇతర నిబంధనలు మరియు షరతులకు బిడ్డర్లందరూ కట్టుబడి ఉండాలి. ఏ దశలోనూ ఎటువంటి కారణం చెప్పకుండానే అధీకృత అధికారి/బ్యాంక్ అత్యున్నత ఆఫర్‌ను అంగీకరించడానికి కట్టుబడి ఉండదు మరియు ఏదైనా లేదా అన్ని ఆఫర్(ల)ను అంగీకరించడానికి లేదా తిరస్కరించడానికి లేదా ఇ-వేలాన్ని వాయిదా వేయడానికి/ రద్దు చేయడానికి లేదా వేలం ప్రక్రియ నుండి ఏదైనా ఆస్తి లేదా భాగాన్ని ఉపసంహరించుకోవడానికి సంపూర్ణ హక్కును కలిగి ఉంటారు. పూర్తి వివరములకు దయచేసి సందర్శించండి : a) https://www.bankeauctions.com., b) https://www.sbi.co.in

గమనిక : ఒకవేళ పైన పేర్కొనబడిన ఇ-వేలం తేదీనాటికి బకాయిలు చెల్లించకపోతే, ఋణాల యొక్క ఋణగ్రహీతకు / హామీదారులకు ఇది ఇ-వేలం యొక్క అమ్మకం గురించి నోటీసుగా గమనించగలరు.

తేది: 27.03.2025, ప్రదేశము: మిర్యాలగూడ — సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

క్లుప్తంగా

మానసిక స్థితి సరిగా లేని వ్యక్తి ఆత్మహత్య


లచ్చిరెడ్డి (ఫైల్)

మాడ్గులపల్లి: మానసిక స్థితి సరిగా లేని వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం మాడ్గులపల్లి మండలంలోని గండ్రవానిగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గండ్రవానిగూడెం గ్రామానికి చెందిన కంచర్ల లచ్చిరెడ్డి(58) మతిస్థిమితం కోల్పోయాడు. ఇటీవల ఆయన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు వెతికి తిరిగి ఇంటికి తీసుకువచ్చారు. లచ్చిరెడ్డి బుధవారం గ్రామ శివారులోని తన సొంత భూమిలో మేకలను కాసేందుకు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుమారులు వెతకగా గ్రామ శివారులోని వేప చెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించిన అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడి కుమారుడు సురేష్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

రోడ్డుప్రమాదంలో యువకుడు మృతి


హరీష్ (ఫైల్)


యాదగిరిగుట్ట రూరల్: రోడ్డుప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామ పరిధిలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గౌరాయపల్లి గ్రామానికి చెందిన కైరంకొండ హరీష్ (26) వ్యక్తిగత పనుల నిమిత్తం బైక్‌పై యాదగిరిగుట్టకు వెళ్లాడు. పనులు ముగించుకుని తన గ్రామమైన గౌరాయపల్లికి సాయంత్రం సమయంలో తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో మాసాయిపేట గ్రామానికి రాగానే, ముందు నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని వెనక నుంచి ఢీ కొట్టాడు. దీంతో బైక్ నడుపుతున్న హరీష్ రోడ్డుపై ఎగిరిపడ్డాడు. తలకు తీవ్రంగా గాయం కావడంతో, 108 సాయంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. కాగా.. నడుచుకుంటూ వెళ్తున్న మాసాయిపేట గ్రామానికి చెందిన వాకిటి కరుణాకర్ అనే యువకుడికి స్వల్ప గాయాలయ్యాయి.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

మునుగోడు: మునుగోడు మండలంలోని పులిపలుపుల గ్రామంలో విద్యుదాఘాతానికి గురై ఆవు మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు చిలువేరు శంకర్ తన ఆవును వ్యవసాయ బావి వద్ద మేపుతున్నాడు. ఈక్రమంలో అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్‌కు ఆవు తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది.

సోలార్ డీహైడ్రేటర్ మోడల్‌కు పేటెంట్

- హక్కులు సాధించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు శ్రీరామ్ శ్రీనివాస్


శ్రీనివాస్ తయారు చేసిన సోలార్ డీహైడ్రేటర్

కోదాడ: ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు సైన్స్‌పై ఉన్న మక్కువతో తన స్నేహితుడితో కలిసి తయారు చేసిన సైన్స్ మోడల్‌కు పేటెంట్ లభించింది. వీరు తయారు చేసిన సౌరశక్తితో పని చేసే సోలార్ డీహైడ్రేటర్ మోడల్‌కు ఇండియన్ పేటెంట్ కార్యాలయం న్యూఢిల్లీ వారు ఈనెల 21న తమ గెజిట్‌లో ప్రచురించారు. ఈ పరికరాన్ని ఉపయోగించి సూర్యరశ్మి ద్వారా ఆహార పదార్థాలు ఎలాంటి రంగు మారకుండా, పోషకవిలువలు తగ్గకుండా ఎండబెట్టుకోవచ్చు.

రూపకల్పన ఇలా..

సూర్యాపేట జిల్లా మునగాల ప్రభుత్వ పాఠశాలలో భౌతికశాస్త్రం స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ శ్రీరామ్ శ్రీనివాస్.. శ్రీనిధి యూనివర్సిటీలో భౌతికశాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ పోతుకనూరి నాగరాజుతో కలిసి ఈ పరికరాన్ని తయారు చేశారు. తక్కువ ఖర్చుతో, సౌరశక్తితో ఈ పరికరం పనిచేస్తుంది. లోకాస్ట్ డీహైడ్రేటర్ విత్ ఇన్‌డైరెక్ట్ సోలార్ ఎనర్జీ గా ఈ పరికరానికి పేరు పెట్టారు. సూర్యరశ్మి ఏ దిశలో ఉన్నా ఈ పరికరం సౌరశక్తిని గ్రహించి పనిచేస్తుంది. దీన్ని ఉపయోగించి ఆహార పదార్థాలను ఎండబెట్టుకోవచ్చు. దీని వల్ల ఆహార పదార్థాల నాణ్యత, పోషకవిలువలు, రంగు తగ్గవని వీరు చెపుతున్నారు. ఈ మోడల్‌ను ఇటీవల రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫెయిర్‌లో ప్రదర్శించారు.

పేటెంట్ పొందడం ఆనందంగా ఉంది



తక్కువ ఖర్చుతో సౌరశక్తిని ఉపయోగించుకొని పనిచేసే విధంగా ఈ పరికరాన్ని తయారు చేశాం. పేటెంట్ కోసం సంవత్సరంన్నర క్రితం దరఖాస్తు చేశాం. ఇండియన్ పేటెంట్ కార్యాలయం వారు వివిధ దశలలో దీన్ని పరిశీలించి మాకు ఈ నెల 23న పేటెంట్ ఇస్తూ అధికారిక జర్నల్‌లో ప్రచురించడం ఆనందంగా ఉంది.

– డాక్టర్ శ్రీరామ్ శ్రీనివాస్

సాహితీ లోకానికి నిజమైన పండుగ ఉగాది


శెట్టిబాలయ్య యాదవ్‌ను జీవన సాఫల్య పురస్కారంతో సత్కరిస్తున్న సుద్దాల అశోక్ తేజ

- సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ

భువనగిరి: సాహితీ లోకానికి నిజమైన పండుగ ఉగాది అని జాతీయ ఉత్తమ సినీ గేయ పురస్కార గ్రహీత సుద్దాల అశోక్ తేజ అన్నారు. జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో శ్రీ విశ్వావసు నామ ఉగాది ఉత్సవాలు– 2025లో భాగంగా గురువారం రాత్రి భువనగిరి మండలంలోని రాయగిరి గ్రామ పరిధిలో గల సోమ రాధాకృష్ణ ఫంక్షన్ హాల్‌లో కవి సమ్మేళనం– ఉగాది పురస్కారాల ప్రదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కవులు, రచయితలకు తమ రచనల ద్వారా సమాజాన్ని చైతన్య పరిచే శక్తి ఉంటుందన్నారు. అతి ప్రాచీన కాలం నుంచి కవులు ఉగాది సందర్భంగా కొత్త రచనలు చేస్తుండడం జరుగుతుందన్నారు. గతంలో భువనగిరి నుంచి ఎంతో మంది కవులు జాతీయ స్థాయికి ఎదిగారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని ప్రస్తుతం ఉన్న కవులు, రచయితలు ఎదగాలన్నారు. అనంతరం శెట్టి బాలయ్య యాదవ్, విరువంటి గోపాలకృష్ణ, లెక్కల మల్లారెడ్డి, హజారి జనార్దన్‌రావు, తోట వెంకటేశ్వరరావులకు జీవన సాఫల్య పురస్కారాలు అందజేశారు. అనంతరం బండారు జయశ్రీ, దండమూడి శ్రీచరణ్, డాక్టర్ పాండాల మహేశ్వర్, వంగలరి ప్రణయరాజ్, బైరపాక స్వామిలకు సాహిత్య పురస్కారాలను డాక్టర్ గుర్రం లక్ష్మీ నర్సింహ్మరెడ్డి, రాగిరామశ్రీ సహదేవ్, కస్తూరి లక్ష్మీనారాయణ,కటకం శ్రీనివాస్‌లకు సేవా పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంజీ యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ కట్టా ముత్యంరెడ్డి, తెలంగాణరాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ సద్ది వెంకట్‌రెడ్డి, బండిరాజులుశంకర్, పెండెం సత్యనారాయణ, మామిడాల చంద్రశేఖర్, గడ్డం నరసింహరెడ్డి, సోమ సీతారాములు,రామాంజనేయులు,ఎస్ఎన్‌చారి,జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పోరెడ్డి రంగయ్య, బండారు జయశ్రీ, మెరుగు సదానందం, లింగారెడ్డి, బండారు శ్రీనివాస్‌రావు, శంకర్ పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసగించిన వ్యక్తికి 27ఏళ్ల జైలు

రామగిరి(నల్లగొండ): యువతిని ప్రేమించి, మోసం చేసిన వ్యక్తికి 27ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి రోజారమణి గురువారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. గుర్రంపోడ్ మండలం శాఖాజిపురం గ్రామానికి చెందిన యువతి తన కుటుంబ సభ్యులతో కలిసి నల్లగొండలో ఉంటుంది. యువతి సోదరుడి ద్వారా కనగల్ మండలం పర్వతగిరి గ్రామానికి చెందిన నల్లబోతు జగన్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. ప్రేమిస్తున్నానని, వివాహం చేసుకుంటానని యువతిని నమ్మించాడు. లైంగికంగా లోబర్చుకున్నాడు. యువతి గర్భం దాల్చిన విషయాన్ని జగన్‌కు చెప్పింది. అతను కాలయాపన చేస్తుండడంతో గట్టిగా నిలదీసింది. ఇదివరకే తనకు వివాహమైందని, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని వివాహం చేసుకోలేనని యువతికి చెప్పాడు. ఈక్రమంలో ఆమెకు బాబు పుట్టాడు. డీఎన్‌ఏ టెస్ట్ చేయడంతో శిశువుకు బయాలాజికల్ ఫాదర్ జగన్ అని తేలింది. నమ్మించి తనను మోసం చేశాడని యువతి 2019 మే 29న గుర్రంపోడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు జగన్‌ను కోర్టులో హాజరుపరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ అఖిల వాదనలో ఏకీభవించిన జడ్జి రోజారమణి సెక్షన్ 376(2)(ఎన్) ఐపీసీ కింద 10 సంవత్సరాలు జైలు, రూ.వెయ్యి జరిమానా, సెక్షన్ 3(2)(వి) ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద 10 సంవత్సరాల జైలు, రూ.వెయ్యి జరిమానా, సెక్షన్ 420 ఐపీసీ ప్రకారం 7 సంవత్సరాల జైలు, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ శిక్షలు ఏకకాలంలో అమలు కానున్నట్లు తీర్పులో పేర్కొన్నారు. కేసులో సరైన ఆధారాలను సేకరించి కోర్టు ఛార్జ్ షీటు దాఖలు చేసిన ఏఎస్పీ మౌనిక, ఎస్సై మధు, సిబ్బంది ఎండీ ఇంతియాజ్ అహ్మద్, మహేశ్వర్, ఆనంద్, ఎండీ ఖలీల్ అహ్మద్, లైజన్ అధికారులు నరేందర్, మల్లికార్జున్‌లను ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించారు.

కులం పేరుతో దూషించిన ముగ్గురికి ఏడాది జైలు

రామగిరి(నల్లగొండ), మాడ్గులపల్లి: కులం పేరుతో దూషించిన ముగ్గురికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి రోజారమణి గురువారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2020లో మాడ్గులపల్లి మండలం కుక్కడం గ్రామానికి చెందిన నకిరేకంటి శ్రీనివాస్ వరిపొలం కోసేందుకు భార్య రజితతో కలసి వెళ్లాడు. వరి కోస్తున్న క్రమంలో వరికోత మిషన్ పక్కన భూమిని ఆనుకుని ఉన్న బట్టు సైదిరెడ్డి భూమిలోకి వెళ్లింది. దీంతో బట్టు సైదిరెడ్డితోపాటు, కుటుంబ సభ్యులు మిషన్‌ను అడ్డుకొని కులం పేరుతో దూషిస్తూ శ్రీనివాస్‌పై దాడి చేశారు. అతడి ఎడమ చేతికి తీవ్ర గాయాలయ్యాయి. ఈమేరకు వారిపై భార్య రజిత ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన అప్పటి ఎస్సై నాగరాజు కేసు నమోదు చేయగా డీఎస్పీ వై. వెంకటేశ్వరరావు విచారణ చేసి నిందితులను కోర్టులో హాజరుపరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ అఖిల వాదనలతో ఏకీభవించిన జడ్జి రోజారమణి బట్టు సైదిరెడ్డి, బట్టు మహేందర్‌రెడ్డి, బట్టు లక్ష్మమ్మలకు సెక్షన్ 325 ఐపీసీ కింద ఆరు నెలలు జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమాన, సెక్షన్ 3(1)(ఆర్)(ఎస్) ఎస్సీ ఎస్టీ ప్రకారం 6 నెలలు జైలు శిక్ష రూ. వెయ్యి జరిమాన విధించారు. రెండు శిక్షలు ఏకకాలంలో అమలు కానున్నట్లు తీర్పులో పేర్కొన్నారు. కేసు విచారణలో కోర్టుకు సరైన ఆధారాలు సేకరించి సమర్పించిన కోర్టు కానిస్టేబుల్ కిరణ్‌కుమార్‌ను అభినందించారు.

జూదం స్థావరంపై పోలీసుల దాడులు

- ఎనిమిది మంది అరెస్ట్
- రూ.25 వేల నగదు, 8 సెల్‌ఫోన్‌లు స్వాధీనం

సూర్యాపేటటౌన్: జిల్లా కేంద్రంలోని జూదం స్థావరంపై పట్టణ పోలీసులు, సీసీఎస్ పోలీసులు దాడులు నిర్వహించి ఎనిమిది మందిని అరెస్టు చేశారు. పట్టణ సీఐ వీరరాఘవులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో గురువారం సాయంత్రం బాబురావు అనే వ్యక్తి ఇంట్లో గ్రూప్‌గా ఏర్పడి జూదం ఆడుతున్న 8 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.25 వేల నగదు, 8 సెల్ ఫోన్లను సీజ్ చేసి సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అరెస్ట్ అయిన వారిలో బాబురావు, వైరాకు చెందిన రామారావు, కూసుమంచికి చెందిన కిరణ్, కూసుమంచి చెందిన నాగేశ్వరరావు, మునగాల మండలానికి చెందిన వెంకట్‌రెడ్డి, ఖమ్మానికి చెందిన గోపి, సూర్యాపేట పట్టణానికి చెందిన ఖాజా, ఆత్మకూరు మండలానికి చెందిన ఏడుకొండలు ఉన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళను కాపాడిన పోలీసులు

నల్లగొండ: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ వివాహిత బుధవారం రాత్రి నల్లగొండ రైల్వే స్టేషన్‌లో రైలు పట్టాలపై ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన స్థానికులు వెంటనే 100కు సమాచారం ఇచ్చారు. స్పందించిన టూటౌన్ ఎస్‌ఐ సైదులు.. కానిస్టేబుళ్లు నాగరాజు, సతీష్‌లను రైల్వే స్టేషన్‌కు పంపించారు. వారు ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి, సఖీ సెంటర్‌కు తరలించారు. గురువారం కుటుంబ సభ్యులను పిలిపించారు. ఈమేరకు కౌన్సిలింగ్ ఇచ్చి ఆమెను వారికి అప్పగించారు.

మద్యానికి డబ్బులు కావాలని తల్లితో గొడవ

- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తల్లి
- మద్యంమత్తులో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న కుమారుడు
- చికిత్స పొందుతూ మృతి

మిర్యాలగూడ అర్బన్: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి తల్లితో గొడవ పడ్డాడు. ఆమె పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించడంతో కుమారుడు మద్యం మత్తులో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. దీంతో తీవ్రగాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డలో చోటు చేసుకుంది. టూ టౌన్ సీఐ సోమనర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బంగారుగడ్డకు చెందిన గుంటోజు వసంతరాయుడు, జయమ్మల కుమారుడు గుంటోజు మధుబాబు(42) భార్య గొడవల కారణంగా అతడిని వదిలి వెళ్లిపోయింది. దీంతో మధుబాబు తల్లిదండ్రుల వద్దే ఉంటున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. ప్రతిరోజు మద్యానికి డబ్బులు ఇవ్వాలని తల్లిని వేధించసాగాడు. బుధవారం రాత్రి మద్యం మత్తులో ఉన్న మధుబాబు తనకు డబ్బులు ఇవ్వాలని, లేకుంటే ఆస్తిలో వాటా ఇవ్వాలని తల్లితో గొడవపడ్డాడు. దీంతో విసిగిపోయిన తల్లి జయమ్మ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మద్యం మత్తులో ఉన్న మధుబాబు తనపైనే పోలీసులకు ఫిర్యాదు చేస్తావా అంటూ.. అప్పటికే తన వెంట బాటిల్‌లో తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. గమనించిన స్థానికులు మంటలు ఆర్పివేశారు. అప్పటికే తీవ్ర గాయాలపాలైన అతడిని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో నల్లగొండ ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చౌటుప్పల్‌లో బేకరీ సీజ్

- గడువు ముగిసిన తినుబండారాలు, బ్రెడ్ ప్యాకెట్ల గుర్తింపు


వంట గదిలో సామగ్రి నాణ్యతను పరిశీలిస్తున్న మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ హనుమాన్‌ప్రసాద్

చౌటుప్పల్: చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని తంగడపల్లి రోడ్డులో ఉన్న బెంగళూరు బేకరీని మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. గురువారం బేకరీలో తనిఖీలు నిర్వహించిన అధికారులు వంటగదిలో ఆహార పదార్థాల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించడంలేదని, గడువు ముగిసిన తినుబండారాలు విక్రయిస్తున్నట్లు, అదేవిధంగా బేకరీలో నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నట్లు గుర్తించారు. దీంతో బేకరీని సీజ్ చేసి, రూ.5వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. హోటళ్లు, బేకరీల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఆహార పదార్థాలు, తినుబండారాల తయారీలో నాణ్యతతోపాటు పరిశుభ్రత పాటించకుంటే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హనుమాన్‌ప్రసాద్, రఘుపతి, లింగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరు దుర్మరణం

చండూరు: బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చండూరు మండలం బంగారిగడ్డ గ్రామ పరిధిలోని పాపిరెడ్డిగూడెం కల్వర్టు వద్ద జరిగింది. నాంపల్లి మండలం జాన్‌తండా పరిధిలోని దొరనిగడ్డతండాకు చెందిన మెగావత్ భాస్కర్ బంగారిగడ్డ నుంచి తన స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. ఈక్రమంలో పాపిరెడ్డిగూడెం కల్వర్టు వద్ద ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉంది. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకన్న తెలిపారు.

స్వర్ణగిరి వేంకటేశ్వర స్వామికి తిరువీధి ఉత్సవ సేవ


స్వామి వారికి తిరువీధి ఉత్సవ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి: భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం రాత్రి స్వామి వారికి తిరువీధి ఉత్సవ సేవ నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో సుప్రభాత సేవ, తోమాల సేవ, సుదర్శన నరసింహ హవనం, తిరుప్పావడ సేవ,, నిత్య కల్యాణం జరిపించారు. మధ్యాహ్నం సుమారు 5వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ మానేపల్లి రామారావు, అర్చకులు పాల్గొన్నారు.


5 లీటర్ల సారా పట్టివేత

కొండమల్లేపల్లి: మండలంలోని చింతచెట్టుతండా నుంచి కొండమల్లేపల్లికి గురువారం ఓ వ్యక్తి బైక్‌పై తరలిస్తున్న 5 లీటర్ల నాటు సారాను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. సమాచారం మేరకు తనిఖీ చేసి సారాను స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

ఆటోను ఢీకొన్న ట్రాక్టర్.. ఒకరు మృతి

హుజూర్‌నగర్: ఆటోను ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఆటోడ్రైవర్ తీవ్రంగా గాయపడి మృతి చెందిన సంఘటన గురువారం చింతలపాలెం మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేటలోని నెహ్రూనగర్‌కు చెందిన తాటికొండ నగేష్ (45) ఓ దినపత్రికలో రూట్ ఆపరేటర్‌గా చేస్తున్నాడు. దొండపాడు నుంచి ఆటో నడుపుకుంటూ చింతలపాలెం వైపునకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో గాంధీనగర్ తండా వద్దకు రాగానే ఎదురుగా ట్రాక్టర్‌లో మిర్చిలోడు వేసుకొని వస్తున్న అజ్మీరగాంధీ అతివేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టాడు. దీంతో ఆటో డ్రైవర్ తాటికొండ నగేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108 వాహనంలో హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యంకోసం సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. నగేష్ అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి మేనల్లుడు బిక్కుమల్ల ఉపేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు.

రెండు ద్విచక్ర వాహనాలు దగ్ధం


దగ్ధమైన ద్విచక్రవాహనం

ఆలేరురూరల్: ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని పెట్రోల్ బంక్‌లో నిలిపి ఉంచిన రెండు ద్విచక్రవాహనాలు గురువారం తెల్లవారుజామున దగ్ధమయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొలనుపాక గ్రామంలో పెట్రోల్ బంక్(గాయత్రి ఫిలింగ స్టేషన్)లో బక్క నరేష్, నల్ల పరుశరాములు పని చేస్తున్నారు. రోజులాగే బంకులో వారి బైక్‌లను పక్కన నిలిపారు. రాత్రి బంక్‌లో నిద్రపోయారు. తెల్లవారుజామున చూసే సరికి రెండు బైక్‌లు పూర్తిగా దగ్ధమై ఉన్నాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా చేశారు. బంక్ యజమాని ఆరె పాండు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రజనీకర్ తెలిపారు.

ఎంజీయూ ఆవరణలో చెలరేగిన మంటలు


ఇంజనీరింగ్ కళాశాల వెనుక భాగంలో దగ్ధమవుతున్న చెట్లు

నల్లగొండ టూటౌన్: నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీ లోపల ఇంజనీరింగ్ కాలేజీ వెనుక భాగంలో గురువారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వేసవి కావడంతో ఎండిపోయి న గడ్డి, పిచ్చి మొక్కలు, చెట్ల నుంచి రాలిన ఎండి ఆకులు ఉండడంతో మంటలు అంటుకున్నట్లు తెలిసింది. అగ్గిపుల్ల వెలిగించి, ఆర్పేయకుండా పడవేయడంతో ఎండిన గడ్డికి అంటుకొని మంటలు వచ్చినట్లు భావిస్తున్నారు. సమయానికి నల్లగొండ పట్టణంలోని ఫైర్ స్టేషన్‌లో వాహనం అందుబాటులో లేకపోవడంతో రామన్నపేట నుంచి ఫైర్ ఇంజన్ తెప్పించి మంటలు చల్లార్చే ప్రయత్నం చేశారు. పెద్ద ఎత్తున మంటలు అంటుకుని పొగ కమ్ముకోవడంతో యూనివర్సిటీ హాస్టల్లో ఉన్న విద్యార్థులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. దాదాపు పది ఎకరాల్లో పెద్ద చెట్లు, మొక్కలు కాలి బూడిదయ్యాయి.

వేసవిలో పశుసంరక్షణ తప్పనిసరి



గుర్రంపోడు: వేసవిలో పశువులు కూడా వడదెబ్బకు గురవుతాయి. నిర్లక్ష్యం చేస్తే అవి మృతిచెందే ప్రమాదం ఉంది. పశువులకు వడదెబ్బ నివారణపై పశువైద్యాధికారి సాయిరాం సలహాలు ఆయన మాటల్లోనే.. ఉష్ణోగ్రత పెరిగి గాలిలో తేమ తగ్గినప్పుడు పశువులు ఎక్కువగా వడదెబ్బకు గురవుతాయి. గాలి ప్రసరణ సరిగా లేకపోవడం, పశువులు షెడ్లలో ఎక్కువ సంఖ్యలో కిక్కిరిసి ఉండటం, నీటి సౌకర్యం అందుబాటులో లేకపోవడం, వడగాలుల తాకిడికి వడదెబ్బకు గురవుతాయి. తెల్లజాతి కంటే నల్ల జాతి పశువులు ఎక్కువగా వడదెబ్బకు గురవుతాయి.

వడదెబ్బ ప్రాణాంతకమే...

వేసవి కాలంలో బయటి ఉష్ణోగ్రత పశువుల శరీర ఉష్ణోగ్రత కంటే ఎక్కువైనప్పుడు మెదడులోని హైపోథాలమస్ స్వేద గ్రంథులపై నియంత్రణ కోల్పోతుంది. దీంతో చర్మంపై గల స్వేద రంధ్రాలు చెమటను అధికంగా విడుదల చేసి శరీరంలోని ఎలక్ట్రోలైట్‌లను కోల్పోయి శరీర పక్రియ మందగిస్తుంది. తద్వారా శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. శ్వాస, గుండె, నాడీ వేగం పెరుగుతుంది. మూత్ర పిండాలు సరిగా పనిచేయకపోవడంతో మూత్ర విసర్జన కుంటుపడుతుంది. పశువుల ఆరోగ్య పరిస్థితి విషమించి అపస్మారక స్థితిలోకి వెళ్తాయి. తద్వారా శ్వాస ఆడక మృతిచెందుతాయి.

వడదెబ్బ లక్షణాలు

వడదెబ్బ తగిలిన పశువుల శరీర ఉష్ణోగ్రత 103 డిగ్రీల ఫారన్‌హీట్ కంటే ఎక్కువగా ఉంటుంది. చర్మసున్నితత్వం కోల్పోయి గట్టిపడుతుంది. పశువులు సరిగ్గా నడవలేక తూలుతూ పడుకోవడానికి ప్రయత్నిస్తాయి. నీడ కోసం చెట్ల కిందకు చేరుతాయి. అధిక దాహం ఉంటుంది. శరీర ఉష్ణోగ్రత 104 ఫారన్‌హీట్ దాటితే శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది. శరీర ఉష్ణోగ్రత 109 డిగ్రీలు దాటితే ప్రాణపాయం సంభవిస్తుంది. వడదెబ్బ ప్రభా వం వల్ల చూలు పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి. పశువుల్లో పునురుత్పత్తి ప్రక్రియ కుంటుపడుతుంది. పాడి పశువుల్లో పాల ఉత్పత్తి బాగా తగ్గిపోతుంది.


పాడి గేదెను చల్లని నీటితో కడుతున్న మహిళా రైతు

చికిత్స ఇలా..

వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని గాలి వీచే ప్రాంతానికి మార్చాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి తీసుకురావడానికి పలుమార్లు కడగాలి. తాగు నీటిని అందుబాటులో ఉంచాలి. వెంటనే పశువైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. వైద్యుల పర్యవేక్షణలో శరీర ఉష్ణోగ్రతలు తగ్గించడానికి ఇంజెక్షన్లు వేయించాలి. రక్తంలోని సైలెన్ ద్వారా గ్లూకోజు, ఎలక్ట్రోలైట్స్ అందిస్తే పశువులు నీరసం నుంచి బయటపడతాయి.

వడదెబ్బ నివారణకు ముందస్తు చర్యలు

వేసవిలో పశువులను మధ్యాహ్నం వేళలో మేతకు వదలొద్దు. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే బయటకు పంపాలి. అన్నివేళలా తాగునీరు అందుబాటులో ఉంచాలి. పశువులను రోజకు కనీసం రెండుసార్లు చల్లని నీళ్లతో కడగాలి. చెరువులు, కుంటల్లో ఈదనివ్వాలి. గాలి వెలుతురు వచ్చేలా ఎత్తయిన కొట్టాలను గడ్డితో నిర్మించాలి. రేకులు ఉంటే మధ్యాహ్నం వేళల్లో వరిగడ్డి పరిచి మధ్యాహ్నం వేళల్లో నీరు చల్లాలి. షెడ్డుల నిర్మాణం తూర్పు, పడమర దిశలలోనే జరగాలి. దీనివల్ల వడగాలుల నుంచి తూర్పు, పడమర ఎండల నుంచి రక్షణ లభిస్తుంది. అదేవిధంగా పాడి గేదెలకు ఉదయం, సాయంత్రం పాలు పితికేటప్పుడు పొదుగును చల్లని నీటిలో కడగాలి. పశువులకు గోమర్లు లేకుండా చూసుకోవాలి.



సాక్షి క్లాసిఫైడ్స్

Wanted

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పెషేంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ: 18k ఫోన్: 9640400073, 9160900024 [SCA25002324]

Services

BUSINESS OFFER

■ శ్రీగోల్డ్ బైయర్స్ మీ బంగారం మణప్పురం ముత్తూట్, మార్వాడీ షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9010190666 [SCA25002404]

ప్రకటన కొంతే! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ. :220/- (Black & White)
అదనపు లైనుకు రూ.: 50/- మాత్రమే
5% GST అదనం
వివరాలకు
నల్లగొండ : 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
సూర్యాపేట : 9912220740
9010038110
కోదాడ : 9010046033
భువనగిరి : 9010073592

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితం గా పరిశీలించి నపిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.